నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామారాజు జిల్లా
ఆదివారం,1 డిసెంబర్ 2024


# 'తుఫాను' కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తుఫాను ప్రభావం వలన ఏజెన్సీ ప్రాంతంలో కురిసే వర్షాలకు కొండ వాగులు పొంగే ప్రమాదం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోను వాగులు ఉధృతంగా ప్రవహించే సమయంలో కాలువలు దాటవద్దని ఏజెన్సీ ప్రజలకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం శనివారం విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావం వల్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాగులు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉన్నందున వాగులు పొంగే సమయంలో కాలువలు ఎట్టి పరిస్థితిలోను దాటవద్దని ఏజెన్సీ ప్రజలను ప్రాజెక్ట్ అధికారి సింహాచలం కోరారు. కాగా ఏజెన్సీ ప్రాంతంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా రెవిన్యూశాఖ, రోడ్డు భవనాల శాఖ, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ, పోలీస్ శాఖ అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కొండ వాగులు దగ్గర ప్రజలు వాగులు దాటకుండా అన్ని మండలాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కడైనా తుపాన్ ప్రభావం వల్ల ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తిస్తే ప్రభుత్వం ద్వారా సహాయక చర్యలు చేపట్టేందుకు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సెల్ నెంబర్ 9441058457, 9492920383, అదేవిధంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08864-243561 టోల్ ఫ్రీ నెంబర్లు తో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడైనా తుపాను వలన ఇబ్బందులు పడుతున్నవారు ఉంటే అయా నంబర్లకు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని, వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐటీడీఏ పీవో సింహాచలం తెలిపారు.

# బి.ఓ.సి సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలి

– సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలి

– ఏపీఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** భూమి,భుక్తి,పీడిత ప్రజల విముక్తి కోసం భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన "అమరవీరుల సంస్మరణ సభ"అచ్చుతాపురం రైల్వే గేటు, పైళ్ళమ్మ తల్లి గుడి వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపిఆర్‌సిఎస్), అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎఐఎఫ్‌టియు) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అచ్యుతాపురం వినాయకుడి గుడిసెంటర్‌నుండి అచ్చుతాపురం రైల్వే గేట్, పైళ్ళమ్మ తల్లి గుడి వద్ద ఏఐఎఫ్‌టియు జండా పోల్ వరకు ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు అధ్యక్షతన సభ జరిగింది. సభలో ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఈ సభకు ప్రధాన వక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అమరుల త్యాగాలను కొనియాడారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగం,అధికధరలు, వివక్షత, మతోన్మాదం వంటి రుగ్మతలు తీవ్రంగా పెరిగాయన్నారు. అడవిలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రజల కోసం పోరాడుతున్న వారిని, అమాయక ఆదివాసులను నక్సలైట్ల పేరుతో కాల్చి చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నిధులను పక్కదోవ పట్టించడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే బి.ఓ.సి సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని, కాకినాడ జిల్లాలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసభలో, ఏపీఆర్ సిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరిరాజబాబు, బి.రమేష్, పిడిఎస్‌యు(వి), రాష్ట్ర నాయకులు కడితి సతీష్, ఏపీఆర్‌సిఎస్ జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, మడికి సత్యం,భవన నిర్మాణకార్మిక సంఘంజిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు డి.నారాయణ మూర్తి, రాయుడు గోవిందు, ఏఐఎఫ్టియూ జిల్లా నాయకులు తిరుమల శెట్టి వెంకటరమణ,పారిశుద్ధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చయేసు,ఏపీఆర్‌సిఎస్ నాయకులు ఏళ్లేసత్తిబాబు, డి.సురేష్, అనుష్క,దుర్గ భవాని, జాను,భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు ప్రభాకర్, కనిగిరిశీను, బాలాజీ,బంగారు ప్రసాదు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలి

– సర్వశిక్ష అభియాన్ జేఏసీ



**చింతూరు,మేజర్‌న్యూస్ :** సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, సిఆర్‌పి లు, ఏంఆర్‌పి లు తదితర ఉద్యోగులు అందరికి మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఎచ్‌ఆర్ పాలసీ వర్తింపచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ ఒప్పంధాలను అమలు చేయాలని, సర్వశిక్ష అభియాన్ జేఏసీ డిమాండ్ చేయడం జరిగింది. శనివారం చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో వున్న కేజీబీవీ, ఎమ్మార్సీ సిబ్బంది, సిఆర్‌పి లతో లను కలసి కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర చెర్మన్ ఎ.వి.నాగేశ్వరావు, సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర జేఏసీ చెర్మన్ కాంతారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సమ్మె సందర్భంగా గత ప్రభుత్వంలో వున్న అధికారులు 16 రకాల డిమాండ్స్ పెట్టి ఒత్తిడి తీసుకొచ్చినప్పుడు పరిష్కారం చేస్తామని మినిట్స్ రూపంలో ఒప్పందాలు చేసుకోవడం జరిగింది అని అన్నారు. అందులో సమ్మె వేతనాలు మాత్రం వేయడం జరిగింది అని, మిగతా ఒప్పందాలు కూడ అమలు చేయాలని అన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా, సమ్మె సందర్భంగా అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని, సమస్యలు పరిస్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కాని ఇప్పుడు రాష్టంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అప్పుల్లో ఉందని సోది చెప్తున్నారని విమర్శించారు. ఉన్నత న్యాయస్థానాలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మినిమం టైమ్ స్కేల్ వర్తింప చేయడానికి, ఎచ్‌ఆర్ పాలసీ అమలు కోసం కమిటీ వేయాలని, సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేసారు. సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో జేఏసీగా ఇచ్చే పిలుపులలో ఐక్యంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## డిసెంబర్ 15లోగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోండి



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గంలో నూతనంగా గృహ నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ఇది ఒక శుభవార్త. ప్రభుత్వము ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 స్కీము మళ్లీ ప్రారంభించింది. ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారులు పూరి పాకలో గాని, పెంకుటిల్లు గాని లేదా అద్దె ఇంట్లో ఉంటూ సొంత స్థలం కలిగి ఉన్నవారు, ఇంటి పునాదులు, బేస్మెంట్లు మొదలుపెట్టి పూర్తి చేసినవారు ఈ పథకానికి అర్హులు. పైన పేర్కొన్న అర్హతలు కలిగి ఉన్నవారు వారి రేషన్ కార్డ్ జిరాక్స్, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు జెరాక్స్, బ్యాంక్ అకౌంట్, ఆదాయ మరియు కుల ధ్రువీకరణ పత్రములు, పొజిషన్ సర్టిఫికెట్ తీసుకుని గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో గాని, లేదా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తోగానీ ఆన్‌లైన్ నందు లబ్ధిదారుల పేరు, వివరాలు డిసెంబర్ 15 తేదీలోగా నమోదు చేయించుకోవాలని తెలియజేయడమైనది. అర్హులైన లబ్ధిదారులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 స్కీమ్‌ని ఉపయోగించుకో వలసిందిగా రాష్ట్ర కార్మికశాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నగరపాలక సంస్థ పరిధిలో 96.1 శాతం పింఛన్ల పంపిణీ



కాకినాడ,మేజర్‌న్యూస్ : డిసెంబర్ నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో శనివారం రాత్రికి 96.1 శాతం పూర్తయ్యిందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. ఉదయం ఐదున్నర గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా.. తొమ్మిది గంటలకే 75 శాతం పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. రాత్రి ఏడున్నర గంటలకు 96.1 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం విశేషమన్నారు. రెండు నెలలకోసారి పింఛన్ల పంపిణీ తీసుకునే అవకాశం ఉన్నా.. పింఛనుదారులు తొలిరోజే పింఛను తీసుకునేందుకు ఆసక్తి చూపారన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పింఛను పంపిణీ చేశామన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 29,874 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా..వారిలో 28,683 మందికి గాను రూ.12,20,00,000 సొమ్మును శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయానికి పంపిణీ చేశామని తెలిపారు.

## శృంగార వల్లభ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేయున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,04,210/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.61,968/-లు, కేశఖండన ద్వారా రూ.6,960/-, తులాభారం ద్వారా రూ.350/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.27,015/- మొత్తం రూ.3,00,503/-లు స్వామి వారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈకార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్టిజన్ మోహన్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం







**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో శనివారం ఉదయం యుసిఇకె మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో వర్క్‌షాప్ ఆర్టిజన్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.మోహన్‌రెడ్డి స్వచ్ఛంధ పదవీ విరమణ కార్యక్రమాన్ని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పిజి బ్లాక్ సెమినార్ హాలు నందు యుసిఇకె ప్రిన్సిపాల్ మరియు జెఎన్‌టియుకె నాన్ టీచింగ్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాధ్ అతిథిగా హాజరయ్యారు. యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా జెఎన్‌టియుకె నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, సెక్రటరీ పి.సత్తిబాబులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ వర్క్‌షాప్ ఆర్టిజన్‌గా విధులు నిర్వర్తిస్తూ స్వచ్ఛంధ పదవీ విరమణ చేస్తున్న జి.మోహన్‌రెడ్డి జెఎన్‌టియుకెలో ఒక భాగమై యూనివర్శిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేశారన్నారు. స్వచ్ఛంధ పదవీ విరమణ చేయడం బాధాకరమైనప్పటికీ ఆయన ఆకాంక్షలు నెరవేరేలా భగవంతుడిని ప్రార్ధిస్తున్నానన్నారు. జి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తాను 1991లో జెఎన్‌టియుకెలో ఉద్యోగిగా చేరడం జరిగిందని, అప్పటి నుండి ఇప్పటివరకు కన్న తల్లి వద్ద ఉన్నట్లే ఇక్కడ ఉన్నానన్నారు. ఉద్యోగ విధుల్లో భాగంగా తనకు సహకరించిన బోధన మరియు బోధనేతర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియ జేశారు. అనంతరం జి.మోహన్‌రెడ్డి దంపతులను అధికారులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లైజనింగ్ ఆఫీసర్ ఎం.కుమారస్వామి, మాజీ ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.డి.లింగరాజు, జెఎన్‌టియుకె నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, జి.మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

– డాక్టర్ యం.సాయి కిషోర్









**చింతూరు,మేజర్‌న్యూస్ :** ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని స్థానిక చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ సాయి కిషోర్ సూచించారు. కళాశాల విద్య డైరెక్టరేట్ వారి ఉత్తర్వుల మేరకు చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, జాతీయ సేవా విభాగం, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సదస్సులో సాయి కిషోర్ ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడారు. దేశాభివృద్ధికి ఆరోగ్యకరమైన సమాజం ఎంతో అవసరమన్నారు. ఎయిడ్స్ వ్యాధిని అరికట్టడంలో యువత పాత్ర కీలకమన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు,అవగాహనతో మాత్రమే ఎయిడ్స్ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులను అరికట్టవచ్చన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ & ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో ఎయిడ్స్ పట్ల సామజిక స్పృహ కల్పించడం ద్వారా సమాజంలో ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. రసాయనిక శాస్త్ర విభాగాధిపతి కె.శకుంతల మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు సమాజాన్ని మేల్కొల్పడానికి దోహద పడతాయన్నారు. ఎయిడ్స్ వ్యాధి అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వక్తృత్వం, పెయింటింగ్, రంగోలి, పోస్టర్ మేకింగ్, ఫేస్ పెయింటింగ్ పోటీలలో ప్రథమ,ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు, మొమెంటోలు అందజేశారు. అనంతరం ముఖ్య అతిధి డాక్టర్.సాయి కిషోర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకటరావు, జి.హారతి, కె.శైలజ, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, ఎన్.రమేష్, పి.సుభద్ర, బి.సంగంనాయుడు, వి.శీనయ్య తదితర అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరితగతిన పనులు పూర్తి చేయాలి





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ సముద్రతీరలో ఉన్న బీచ్ ప్రాంతాన్ని పర్యాటకులకు ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా మలిచేందుకు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ మునిసిపల్ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి రెవెన్యూ, పర్యటకం,జిల్లా పరిషత్తు, పంచాయతీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కౌడా), శిల్పారామం, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో కాకినాడ సముద్ర తీర ప్రాంతం అభివృద్ధి, కార్యకలాపాల ప్రారంభం, నూతన ప్రాజెక్ట్ అంశాలపై చర్చించారు. తిరిగి సముద్ర తరంలో సాగర సంబరాలు నిర్వహణకు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కౌడా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎయిర్ క్రాఫ్ట్ ప్రారంభం, బీచ్ ఫ్రెంట్, రెస్టారెంట్, లైటింగ్, ఎగ్జిబిషన్స్, బీచ్ క్లీనింగ్, గ్లాస్ బ్రిడ్జి వంటి విషయాలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాకినాడ సముద్రతీర ప్రాంతానికి రోజు వేలాదిమంది సందర్శకులు వస్తూ ఉంటారన్నారు. సందర్శకులకు మంచి ఆహ్లాదాన్ని అందించడంతోపాటు సముద్ర తీర ప్రాంతాన్ని ఆకర్షణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి వద్ద ఉన్న బీచ్ పార్క్, కౌడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎయిర్ క్రాఫ్ట్‌ను రానున్న డిసెంబర్ 20 నాటికి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇందుకు పర్యాటకం, మున్సిపల్ కార్పొరేషన్ జిల్లా పరిషత్, పంచాయతీ, శిల్పారామం ఇతర శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధానంగా రెండు నెలలపాటు ప్రతిరోజు బీచ్ క్లీనింగ్‌పై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్లాస్టిక్ రహిత, పర్యావరణ సహిత, క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్ పార్క్‌ను తీర్చిదిద్దాలన్నారు. రిసార్ట్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సందర్శకులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

శిల్పారామాన్ని ఇంకా సందర్శకులకు ఆకర్షణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో వీ.వీ.వీ.ఎస్.లక్ష్మణ రావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి పి.పోశయ్య, ఏపీటీడీసీ మేనేజర్ సీహెచ్.పవన్ కుమార్, డీఈ జీ.సత్యనారాయణ, ఏపీవో వి.త్రిమూర్తులు, శిల్పారామం ప్రతినిధి సీ.మోహన్ తేజ, కౌడా, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ అవార్డు ఎంతో బాధ్యతనిచ్చింది

– ప్రజలకు మెరుగన వైద్యసేవలు అందించడమే నా లక్ష్యం

– డాక్టర్ వీర్రాజు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర స్థాయిలో 2023-24 సంవత్సరానికి టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ సంస్థ మొత్తం వైద్య సేవలు అందిస్తున్న హాస్పిటల్, వైద్యుల ప్రతిభ గుర్తించి అందించే టైమ్స్ హెల్త్ ఎక్సలెంట్ అవార్డ్ అందుకోవడం తనకు ఎంతగానో బాధ్యతలను పెంచిందని డాక్టర్ బిహెచ్ పిఎస్ వీర్రాజు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ పార్క్ హయాత్ హొటల్లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ విష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా వీర్రాజు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం నాగమల్లి తోట సెంటర్లో ఉన్న టీం హాస్పిటల్లో ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ అవార్డ్ అందుకోవడం కన్నా తమ ఆసుపత్రుల్లో వైద్యం అందుకుని ఆరోగ్యవంతులుగా వారి ఇళ్లకు వెళ్ళడం తనకు ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. ఈ అవార్డ్ సూర్య గ్లోబల్ ఆసుపత్రి, టీం ఆసుపత్రిలలో తాను పడిన కష్టానికి ఈ అవార్డు దక్కిందన్నారు. తన సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. ఈ అవార్డు అందుకున్న బాధ్యతతో నిరంతరం ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తానని డాక్టర్ వీర్రాజు తెలిపారు. కార్యక్రమంలో ఏవో తిరుపతిరావు పాల్గొన్నారు.

### గణపతిపీఠంలో భగవద్గీత రాజ్యాంగ గ్రంథానికి ప్రత్యేక పూజలు

– అప్పనపల్లి బాలబాలాజీ విగ్రహ ప్రతిష్టతో శ్రీవారి 61వ సహస్రనామార్చన





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** భారతీయతలో ప్రకృతి ధర్మాన్ని పరమాత్మగా ఆరాధించడం ఎంత పవిత్రమో భారత రాజ్యాంగ ఔన్నత్యం కోసం అధ్యయనం ఆచరణ పరిరక్షణ అంతే రీతిగా పాటించాలని స్వయంభూ కాకినాడ భోగిగణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడిరమణరాజు పేర్కొన్నారు. సూర్యారావుపేట దూసర్లపూడి వారి వీధిలోని గణపతి పీఠంలో శనివారం ఉదయం సుప్రభాత వేళలో శ్రీవారి 61వ జపయజ్ఞ పారాయణ జరిగింది. కొబ్బరికాయల రాశి నడుమ అప్పనపల్లి బాలబాలాజీ విగ్రహాన్ని ప్రతిష్టించి సహస్ర గోవిందనామ స్తోత్ర పఠనం నిర్వహించారు. భగవద్గీత రాజ్యాంగ గ్రంథాన్ని సప్తగిరుల పూజలో వుంచి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ప్రజాస్వామ్య దేవాలయంలో కొలువై వున్న రాజ్యాంగ అంశాలు గురించి ప్రతి ఒక్కరూ మరింతగా రాజ్యాంగ విధులను తెలుసుకోవాలన్నారు. ప్రకృతిని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటే అవి మనల్ని కాపాడుతాయ ని, భగవద్గీతలో ఆత్మతత్వం జీవన గమ్యం గమ్యసాధనా ఎలా పొందుపర్చబడ్డాయో జాతి జీవన విధానం చైతన్య స్ఫూర్తి ఆత్మను ఆత్మ విశ్వాసాన్ని సంరక్షించే సమ్మేళనంగా రాజ్యాంగం నడిపిస్తున్నదన్నారు. పంచామృతాలతో విఘ్నేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామివార్ల విగ్రహాలకు అభిషేకాలు చేసి శ్రీవారి ఆరాధకులకు తాంబూలాలు పంపిణీ చేశారు. రాజ్యాంగంలోని ముఖ్య అంశాలను ప్రవచనం చేశారు. స్వయంభువుకి పంచలోహాల తాపడంతో కాంస్య కవచధారణ యజ్ఞం జరిగిన సందర్భంగా పీఠంలో ప్రతిష్టితమైన శ్రీవారి పాదాల వద్ద 108 వారాల పాటు శనివార వ్రత నిర్వహణ జరుగుతున్నదని పీఠం నిర్వాహకులు తెలియజేశారు.

సూర్య
తూర్పుగోదావరి
ఆదివారం, 1 డిసెంబర్ 2024


## మండలంలో 84 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**- ఎంపీడీవో యాదగిరేశ్వరరావు**

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలో తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తున్న జోరు వానను చైతం లెక్క చేయకుండా సచివాలయం సిబ్బంది 5280 ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో 63 27 మంది పింఛన్ దారులకు 2.58కోట్లు మంజూరు కాగా శనివారం 5280మందికి పింఛన్లు ఇప్పడం జరిగిందని 84 శాతం పింఛన్లు అంద చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. పింఛన్లు అందజేయడంలో సచివాలయ సిబ్బంది తో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డుపనులు ప్రారంభించిన ఎంపీటీసీ దేవికారాణి



**పెరవలి,మేజర్ న్యూస్ :** మల్లేశ్వరం గ్రామంలో మల్లేశ్వరం అన్నవరప్పాడు రహదారి నుండి అన్నవరప్పాడు సెంటర్ కు వెళ్లే కాలవ గట్టురోడ్డును రూ 19,80,000 రూపాయల గ్రాంట్ నిధులతో సిమెంటు రోడ్డు వేసే పనులను నవంబర్ 30వ తేదీ శనివారం మల్లేశ్వరం ఎంపీటీసీ కోటిపల్లి దేవికారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ మల్లేశ్వరం అన్నవరప్పాడు రహదారి నుండి అన్నవరప్పాడు సెంటర్కు వెళ్లే కాలువ గట్టు రహదారి ప్రస్తుత నిధులతో సగం పూర్తవుతుందని మిగిలిన సగం రోడ్డు మరియు కాలువ గట్టుకు రిటైనింగ్ వాల్ కావలసి ఉందని వాటికి అవసరమైన నిధులను మన మంత్రివర్యులు కందుల దుర్గేష్ నిడదవోలు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు సహకారంతో మంజూరు చేయించుకుని కాలువ గట్టు రోడ్డును పటిష్టపరిస్తే మల్లేశ్వరం వాసుల చిరకాలవాంఛ తీరుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరం ఎక్స్ ఎంపీపీ కోటిపల్లి మురళీకృష్ణ, జనసేన నాయకులు మేడ్చెర్ల బాబి, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకలాపాలు నిర్వహించని బోట్స్ మ్యాన్ సొసైటిల అనుమతులు రద్దు చేయాలి

**- అనుమతులు పొందిన సొసైటిల కార్యకలాపాలుపై 48గంటల్లో నివేదిక అందజేయాలి**
**- రీ టెండర్ ప్రక్రియపై ఎస్ఓపి అనుసరించి చర్యలు తీసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** డిసిల్టేషన్ పాయింట్స్ ఆధ్వర్యంలో కనీస స్థాయిలో త్రవ్వకాలు జరిపే విధానం ఉండాలనీ, ఇందులో ఎటువంటి విచలనం లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, డి ఎల్ ఎస్ ఎ ఛైర్మన్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. శనివారం స్థానిక కలెక్టరు క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లా పరిధిలో 140 బోట్స్ మ్యాన్ సొసైటి లకి డిసిల్టేషన్ పాయింట్స్ వద్ద ఇసుక త్రవ్వకాలు జరిపేందుకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. సంభందిత బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులు జీవన భృతి కొరకు చేసుకున్న విజ్ఞప్తిని అనుసరించి ఇసుక త్రవ్వకాలు జరపాల్సిందిగా అనుమతులు జారీ చేశామని తెలిపారు. అందుకు అనుగుణంగా ఆయా బోట్స్ మ్యాన్ సొసైటిలు కనీస స్థాయిలో త్రవ్వకాలు చేపట్టాలని,ఆ ప్రక్రియపై పర్యవేక్షణా తప్పనిసరి అని ఆదేశించారు. 48 గంటల్లో ఏపి బైట్స్ మ్యాన్ సొసైటిల రోజుకి ఎంత చొప్పున ఇసుక త్రవ్వకాలు జరిపారో ఇరిగేషన్,మైన్స్అధికారులు సమగ్రనివేదిక అందచేయాలని పేర్కొన్నారు. ఎటువంటి త్రవ్వకాలు నిర్వహించకుండా నిరార్ధకంగా బోగస్గా



ఏర్పడిన బోట్లు మ్యాన్ సొసైటిల అనుమతులు నివేదిక ఆధారంగా రద్దు చేయాలన్నారు. ఆమేరకు వొచ్చే కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలియ చేశారు. ట్రాక్టర్ల ద్వారా ఉచిత ఇసుక సరఫరా విధానంపై గణాంకాలు తెలియ చెయ్యాలని, అధికారుల సమక్షంలో నమోదు చేసుకున్న ట్రాక్టర్ల ద్వారా సరఫరా విధానం ఉండాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానంలో ఎంతమందికి ప్రయోజనం చేకూర్చగలిగాం తెలుసుకోవడం సాధ్యం అవుతుందని తెలిపారు.ఆర్డీవోలు ఈమేరకు చర్యలు తీసుకోవడం, వొచ్చే సమావేశంలో నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. ఓపెన్ రిచ్ లలో త్రవ్వకాలు,లోడింగ్ సమాంతరంగా చేపట్టాలని,డంప్పింగ్ చేయరాదని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. రాఘవ ఏజెన్సీస్ కి ఇచ్చిన అనుమతులు డిసెంబర్ 20 తో ముగుస్తుందని అధికారులు కలెక్టరుకి వివరించారు.ఈ నేపధ్యంలో కొత్తగా సెమీ మెకన్షైజ్ద్ విధానంలో ఇసుక త్రవ్వకాలకోసం ఏజెన్సీగుర్తించే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానంతో పాటు, "ఈ ఎమ్ డి" మొత్తాన్ని పెంచాలని ఆదేశించారు. టెక్నికల్ కమిటీలో జిఎస్టీ అధికారిని కూడా సభ్యునిగా నియమించాలని కలక్టర్ తెలియ చేశారు. ఇసుక అక్రమ త్రవ్వకాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సుమోటోగా కేసులు నమోదు చేయాలన్నారు.అక్రమరవాణాజరిపే పాయింట్స్ వద్ద చెక్పోస్టులనుఏర్పాటు చేయాలన్నారు .జిల్లాలో కొత్తగా నాలుగు ఓపెన్ రిచ్లని గుర్తించామని, వేమగిరి (కడియం) , తిపర్రు (పెరవలి) ,పెండ్యాల (నిడదవోలు) ,పందలపర్రు (నిడదవోలు) జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. వీటికి జియో గ్రాఫికల్ విధానం రీచ్కి పేరు ప్రతిపాదించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమన్వయ శాఖల కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సిఫార్సు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, అదనపు ఎస్పి ఎన్బిఎమ్ మురళీ కృష్ణ, ఆర్డీవోలు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత ,జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, ఈఈ (ఇరిగేషన్ రివర్ కన్సర్వేటరీ) ఆర్కాశీ విశ్వేశ్వర రావు,జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, జిల్లా భూగర్భజల అధికారి వై శ్రీనివాస్, జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారి బివి గిరిలు పాల్గొన్నారు.

## శృంగవరంలో అపారిశుధ్యం

**- పట్టించుకోని అధికారులు**



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** రౌతుల పూడి మండలంలోని శృంగవరం గ్రామంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంతో అపారిశుధ్యం నెలకొంది. పలుమార్లు ఫిర్యాదు చేసిన పంచాయితీ అధికారులు పట్టించుకోలేదని అంటున్నారు. కొన్ని వీధులలో ఇళ్ల మధ్య చెత్త డప్పి యార్డులను తలపిస్తుంది. చెత్తచెదరంతో నిండి విధులలో డ్రైనేజీలు కొంపుకొడుతున్నాయి.పంచాయతీ నిధులు పుష్కలంగా ఉన్న రికార్డులుకే పరిమితం అవుతున్నాయని పలువురు ఆరోపిసున్నారు. శృంగవరంలో అసలు పంచాయతీ అధికారులు ఉన్నారో లేదో తెలియని పరిస్థితి ప్రజలది.క్రమం లేకుండా డ్రైనేజీలు తీయడం అధికారులు బాధ్యరహిత విధులకు నిదర్శనము. విధివిధానాల పాటించకుండా చెత్తాచెదారులు ఇష్ట రాజ్యంగా రోడ్లపై అడ్డుగా వేయడం,ఇళ్ల మధ్యలోనే చెత్త చెదారాలు ఉన్న పట్టించుకోకపోవడంతో ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి కొందరిది.గ్రామ సర్పంచ్ కు చెపితే, సెక్రెటరీ చెప్పమని, సెక్రటరీకి చెప్తే సర్పంచ్కి చెప్పమని కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు.చుట్టుపక్కల గృహాలు వారు డ్రైనేజీలో పడి కుళ్ళిన చెత్తాచెదారం కొంపుకొడుతున్నాయి.నిత్యం దుర్వాసన వెదజల్లడంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి.చెత్త కుప్పులతో విషసర్పాల బారిన పడే అవకాశం ఉందని భయం ఆందోళన చెందుతున్నారు. సమస్య ఉన్నప్పుడు వెళ్లి విన్నవించిన పట్టించుకోకపోవడంతో పలువురు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.సుమారు మూడు నెలల క్రితమే ఈ గ్రామంలో డైయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలతో గ్రామం ప్రజలు అట్టట్లాడారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హెల్మెట్ ధారణ భారం కాదు.. మన బాధ్యత

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** శనివారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి. గంధం సునీత మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు గజిల్లా కోర్ట్ ఆవరణలో "రోడ్డు ప్రమాదాల నివారణ" మరియు "హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకత" పై కోర్ట్ సిబ్బందికి విజ్ఞాన మరియు అవగాహనా సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం లో వివిద బ్యాంకుల సహకారంతో హెల్మెట్ లేకుండా ద్వి చక్ర వాహనం నడిపే ఔట్ సోర్సింగ్ సిబ్బంది కి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరం మరియు చట్టరిత్య నేరం అని తెలిపారు.అతి వేగం ప్రమాదకరమని, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించి ఎవరు వాహనాలు నడపరాదని అన్నారు. హెల్మెట్ ధరించడం శిరస్సు పై బరువుగా భావించుకుండా అది మీ బాధ్యతగా భావించాలి అని తెలిపారు.

## కమ్యూనిటీ హెల్పర్స్కు ఘన సన్మానం



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** స్థానిక రామచంద్రపురం శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థులలో వివిధ రకాలైన అంశాల పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా సోషల్ వీక్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ విద్యార్థులు దేశ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి వాటిని గౌరవించేలా చెయ్యడం, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు విద్యార్దులు నిర్వహించాల్సిన బాధ్యత, తల్లిదండ్రుల పట్ల, గురువల పట్ల గౌరవం కలిగి ఉండేలా ఈ సోషల్ వీక్ ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రీజినల్ ఇన్చార్జి నరేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సొసైటీ పట్ల బాధ్యత కలిగి ఉండి సమాజంలో అందరినీ గౌరవభావంతో చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన శనివారం స్కూల్లో పనిచేస్తున్న ఆయాలు, స్కావేంజర్స్, డ్రైవర్, క్లీనర్లును సన్మానించడం జరిగింది. కార్యక్రమం చివరిలో విద్యార్ధులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇంచార్జి వల్లి మరియు ప్రైమరీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలుర పర్యవేక్షణ గృహమును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్ బాబు పట్టణంలోని కె.వి. స్టేట్ హోం మరియు బాలుర పర్యవేక్షణ గృహమును సందర్శించారు. ముందుగా ప్రకాష్ నగర్లోని కె.వి. స్టేట్ హోంను సందర్శించి అక్కడ వసతులని పరిశీలించారు. ఆ తరువాత బాల సదనమును సందర్శించి చిన్నారు లతో మాట్లాడారు. వారికి అక్కడ ఏ విధమైన అసౌకర్యం ఉన్న తెలియజేయాలన్నారు. అనంతరం ఉద్యోగినుల వసతి గృహమును సందర్శించి వసతులను పరిశీలించారు. ఆ వసతి గృహ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్కడ అందచేస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం బాలుర పర్యవేక్షణ గృహమును సందర్శించిన న్యాయమూర్తి అక్కడి వసతులను పరిశీలించి బాలురుతో కాసేపు మాట్లాడారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలన్నారు. న్యాయ మార్గాన్ని అనుసరిస్తే జీవితంలో ప్రశాంతత, గౌరవం లభిస్తాయని లేదంటే జీవితం దుర్బలం అవుతుందని వివరించారు. వారికి ఎలాంటి న్యాయ సేవలు కావాలన్న జిల్లా న్యాయ సేవాధికర సంస్థకి తెలియజేయాలన్నారు.

# డాక్టర్ విజయబాబు వైద్యసేవలు అభినందనీయం



**ఏలేశ్వరం, మేజర్న్యూస్:**గిరిజన ప్రాంతానికి ముఖ ద్వారంగా ఉన్న ఏలేశ్వరంలో దశాబ్దాల కాలంగా వైద్య సేవలు అందిస్తూ అత్యాధునిక వైద్య సేవలు అందించే విధంగా ముందుకు సాగుతున్న డాక్టర్ విజయబాబు అభినందనీయుడని శాసనమండలి సభ్యులు యనమల రామకృష్ణుడు కొనియాడారు. ఏలేశ్వరంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ సఖి రెడ్డి విజయబాబు నర్సింగ్ హోమును అత్యధికంగా తీర్చిదిద్ది మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఆధునికరించారు. శనివారం సీనియర్ నేత శాసన మండల సభ్యులు యనమల రామకృష్ణుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి ముఖద్వారం గా ఉన్న ఏలేశ్వరంలో దశాబ్దాల కాలంగా నిరంతరం వైద్య సేవ లందిస్తూ ప్రజల మన్ననలు పొందిన డాక్టర్ విజయబాబు అభినందనీయుడన్నారు. ఆయన తనయుడు. వెంకట్ వైద్యరంగంలో ప్రత్యేక శిక్షణ పొంది అనేక కార్పొరేట్ సంస్థల్లో సేవలందిస్తున్నారు. ఈ ప్రాంతంలో అత్యధిక సేవలు అందించడానికి ముందుకొచ్చిన తండ్రి కొడుకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వి ఎస్ఎన్ రాజు,స్థానిక నాయకులు మూది నారాయణస్వామి, బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ పూర్తి



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 17 కేటగిరి ల కింద 2,37,389 మందికి రూ.101 కోట్ల 63 లక్షల 33 వేల రూపాయల ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు.శనివారం కొవ్వూరు మండలం తొగుమ్మి గ్రామంలో ఆర్డీవో రాణి సుస్మిత తో కలిసి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టరు పాల్గొన్నారు.డిసెంబర్1వ తేదీ ఆదివారం ప్రభుత్వ సెలవు దినం నేపథ్యంలో నవంబర్ 30 వ తేదీ శనివారం ఉదయం పెన్షన్ లు ఇంటి వద్దనే అందజేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 18 రూరల్ మండలాల్లో, 3 పట్టణ ప్రాంతాల్లో 9041 క్లస్టర్స్ పరిధిలో 5128 మంది సిబ్బందిచే ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి చేయనున్నట్లు కలెక్టరు ప్రశాంతి తెలియ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొగుమ్మి గ్రామంలో దివ్యాంగులైన తల్లి కొడుకులకు తామరపల్లి నూకరత్నం, తామరపల్లి సంతోష్ లు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు చొప్పున పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనుకోని కారణాల వలన పెన్షన్ పంపిణీ అందుకోలేని పెన్షన్ తీసుకోని పింఛనుదారులకు మూడు నెలల వరకు పెన్షన్ బకాయిలు చెల్లించబడతాయని పేర్కొన్నారు. పింఛనుదారులు 3 నెలలు నిరంతరంగా పింఛను తీసుకోని వారిని శాశ్వత వలసగా పరిగణించి వారి పెన్షన్ నిలిపివేయబడుతుందని, అభ్యర్ధనను తేదీ నుండి 3 నెలల లోగా ఎలాంటి బకాయిలు లేకుండా రోల్బ్యాక్ పింఛను విడుదల చేస్తామని కలెక్టర్ తెలియ చేశారు. కుటుంబ పోషణ కోసం ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందే పెన్షనర్ మరణిస్తే జీవిత భాగస్వామి పెన్షన్ ప్రామాణిక ఆపరేటింగ్ విధానం లో పెన్షన్ మంజూరు చెయ్యడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 11 గంటలకి జిల్లా లో 237389 మంది పెన్షన్ దారులకు గాను 215424 (90.75 శాతం) ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ పూర్తి చేసి నట్లు తెలిపారు.ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ, కొవ్వూరు మండలం, అర్బన్ ప్రాంతంలో 536 క్లస్టర్ ఏరియాలో 265 మంది సిబ్బంది ద్వారా 14,048 మందికి పింఛన్లు పంపిణి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు ఎంపిడివో కాశీ సుశీల, పంచాయతీ సెక్రెటరీ ఉయ్యాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దశ సహస్ర దీపోత్సవం పూజ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కార్తీక మాసం సందర్భంగా స్థానిక గోదారి గుంట జర్నలిస్టు కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిరంలో మాధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో దసరా సహస్ర అష్టోత్తర దీపోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత సాయంపూజా కార్యక్రమాలను ఆధ్యాత్మికవేత్త డాక్టర్ యాతగిరి పరుశురామ్ నిర్వహించగా ఉసిరి చెట్టు మరియు తులసి బృందావనం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మతీర్ధ స్వామీజీ ఆశీస్సులతో జ్యోతి ప్రజ్వలన చేయగా భక్తులందరూ ఈ విశేష కార్యక్రమంలో పాల్గొని దీపాలను వెలిగించారు. అనంతరం దీపాలన్నింటికీ శాస్త్రక్తంగా పూజాది కార్యక్రమాలు చేసి శ్రీ రమాసహిత సత్యదేవ, దాసాంజనేయస్వామివార్లకు విశేష నివేద కార్యక్రమాన్ని జరిపారు, ఉమా సాంబశివలింగానికి భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా మద్వేష్ మాట్లాడుతూ దీప ప్రజ్వలన ద్వారా గాఢాంధకారాన్ని తొలగించుకుంటామన్నారు. అదేవిధంగా మన మనసులో జ్యోతి ప్రజ్వలన చేయడం ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని పొందగలమని ఇటువంటి విశేష కార్యక్రమాలు భక్తుల సహాయ సహకారాలతో విజయవంతంగా నిర్వహించామన్నారు. గురుదేవులైన సత్యాత్మ తీర్థ స్వామీజీ అనుగ్రహ బలంతో పూర్తి చేయగలిగామని చెప్పారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా దీపోత్సవ కార్యక్రమాన్ని మందిర ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఇదే రోజు ధన్వంతరి జయంతి కూడా కలిసి రావడం మన అందరి అదృష్టంగా భావించాలని ధన్వంతరి భారీ విగ్రహాన్ని స్వామీజీ మైసూర్ నగర ఉత్తరాధిమఠ ప్రాంగణంలో ప్రతిష్టించి దర్శించుకునే భాగ్యాన్ని మనకి కలుగజేసారని ప్రణామాలను అర్పించుకున్నారు. కార్తీక మస సందర్భంగా ప్రతినిత్యం కార్తీకదీపం వెలిగిస్తూ భక్తులందరికీ విశేష అనుగ్రహాన్ని కల్పించాల్సిందిగా కార్తీక దామోదర భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.కార్యక్రమంలో చట్టి వసంత శ్రీనివాసరావు, జాకీర్ధర్ ప్రేమ కుమార్, రాచూరి శేషగిరిరావు, నందగిరి నందాప్రవీణ్, ప్రహల్లాద నందగిరి, ఉదయగిరి శేషగిరిరావు, సరబాధ పద్మావతి, కె.వి.వరప్రసాద్ తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# చలికాలంలో పశువులకు సంరక్షణ అవసరం



**- పశువైద్యురాలు అన్నపూర్ణ నాయుడు**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** చలి తీవ్రత బాగా పెరుగుతుండడంతో పశువుల పెంపకంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆనూరు పశువైద్యాధికారిణి డా.అన్నపూర్ణ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ చలి కాలంలో అధిక పాల దిగుబడిని ఇచ్చే పశువులలో పాల జ్వరం వచ్చే ప్రమాదం ఉందని, రాత్రిపూట ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడం, కాల్షియం అధిక శాతం పాల ద్వారా పోతుండడం వల్ల దీని వల్ల మేతలో కాల్సియం, మెగ్నీషియం వంటి లవణాలు ఉండేలా చూడాలని పశు రైతులకు ఆమె సూచించారు. డిశంబర్, జనవరి నెలలో అధిక సంఖ్యలో జీవాలు ఈనే అవకాశం ఉందని, అప్పుడే పుట్టిన పిల్లలకు చలి తీవ్రత తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లి దగ్గర పాలు ఉండేలా సరైన పోషక విలువలు గల మేత పశువులకు అందించాలని, ఆమె సూచించారు. పశువులకు అందించే దాణాలో పిండి పదార్థాలు ఎక్కువగా, మాంసకృత్తులు తక్కువగా ఉండాలని, లేగదూడలు వెంట్రుకలను సీతాకాలంలో కత్తిరించకూడదని, ఆరుబయట కాకుండా, పాకలో కట్టి ఈదురు గాలులు, మంచు బారిన పడకుండా పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని, చలి గాలుల తీవ్రతకు లేగదూడలు త్వరగా అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉన్నందున, రైతులు పశువుల పట్ల జాగ్రత్తలు వహించాలని, వెంటనే దగ్గరలోని పశు వైద్యులను సంప్రదించి, మెరుగైన వైద్య సేవలు పొందాలని డా.అన్నపూర్ణ నాయుడు తెలిపారు.

## పాఠశాలల అభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ

**- ప్రత్యేక సమావేశం నిర్వహించిన పవన్ కళ్యాణ్ ఓఎస్డి వెంకటకృష్ణ**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పవన్ కళ్యాణ్ ఓ ఎస్ డి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో... పాఠశాలల అభివృద్ధిపై స్థానిక రధాలపేట అంబేద్కర్ భవన్ నందు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ముందు చూపు కలిగి విద్యార్థులకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై ఇంజనీర్లు, విద్యాశాఖ అధికారులు, మండలాభివృద్ధి అధికారులు, ప్రధానోపాధ్యాయులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాను చదివి అభివృద్ధి చేసిన ఒక పాఠశాలను లఘు చిత్రంగా రూపొందించి ప్రదర్శించారు. పాఠశాల అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు తయారు చేయాలి, ఇటువంటి ప్రణాళికలు తయారు చేయడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుంది అన్న అంశంపై వివరించారు. పిఠాపురం నియోజవర్గ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనవరి 11వ తేదీన వచ్చి కార్యక్రమం ప్రారంభించే విధంగా... పాఠశాలలలో మౌలిక వసతులు, సాధ్య సాధ్యాలు, అవసరాలు, రాబోవు 2 సంవత్సరాలలో ప్రతి పాఠశాల ఆదర్శవంతంగా తీర్చి దిద్దడానికి చేపట్టబోయే చర్యలపై ప్రణాళికలు తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో... గొల్లప్రోలు, యు. కొత్తపల్లి, పిఠాపురం మండలాలకు చెందిన 60 మంది ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఉపముఖ్యమంత్రి ఫేషి నుండి శివరాం, డి ఎస్ ఎస్ ఎ వెంకటరాజు, సివైఈఓఎన్. వెంకటేశ్వర రావు, మూడు మండలాల విద్యాశాఖ అధికారులు, జిఎన్ఎంలు వర్క్ షాపులో పాల్గొన్నారు.

## రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తక్షణం మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధిక రైతులకు విజ్ఞప్తి



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** శనివారం కలెక్టరు ఆదేశాల మేరకు పెరవలి , ఉండ్రాజవరం మండలాల పరిధిలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ టి రాధిక వివరాలు తెలియ చేస్తూ, జిల్లా యంత్రాంగం పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపట్టే నేపథ్యంలో రైతులకి ప్రయోజనం చేకూర్చే విధంగా 2024-25 ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు చేపట్టడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. క్వింటాల్ ధాన్యం కొనుగోలు చేసేందుకు కామన్ వెరైటీ కి రూ.2300 , ఏ గ్రేడ్ వెరైటీ కి రూ.2320 కనీస మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 221 రైతూ సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చెయ్యడం జరిగిందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రాంతాల వారీగా రైతులు కోతలు కొస్తున్న ప్రాంతాలలో కొనుగులు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 202 కోనుగోలు కేంద్రాల ద్వారా 19,916 మంది రైతుల నుంచి 28,727 ఎఫ్ టి వో ల ద్వారా 1,57,700 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసినట్లు తెలిపారు. ఇందు నిమిత్తం రైతులకి చెల్లించాల్సిన రు.362 కోట్ల 74 లక్షలకు గాను రూ.300 కోట్ల 64 లక్షలు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో కోతలు పూర్తి అయి బహిరంగంగా ఉంచిన, రహదారులపై ఆరబెట్టిన ధాన్యం ను మిల్లులకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకి కనీస మద్దతు ధర కల్పించే దిశలో జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా కంట్రోల్రూంనెంబర్: 8309487151కు గానీ, .టోల్ ఫ్రీ నంబరు : 1967కు గానీ ఫిర్యాదు చేయవచ్చునని రాధిక తెలియ చేశారు.ఈపర్యటనలో ఇండ్రాజవరం తహసిల్దార్ పిఎన్డి ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
ఆదివారం,
1 డిసెంబర్ 2024


## భక్త జన సందోహంతో కిటకిటలాడుతున్న కొవ్వూరు వారాహి అమ్మవారి పీఠం




కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ రూరల్ మండలం పరిధి కొవ్వూరు గ్రామంలో ఇటీవల కాలంగా వెలిసిన వారాహి అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో తరలి రావడంతో కొవ్వూరు గ్రామం ప్రసిద్ధ పీఠంగా మారింది. ఈ గ్రామానికి చెందిన లక్ష్మి ప్రసన్న వారాహి అమ్మవారికి ఆలయ నిర్మాణం చేపట్టి నిత్య హెూమాలు, పూజలు నిర్వహించడం జరుగుతుంది. కార్తీక మాసం పంచమి పర్వదినం సందర్భంగా సుమారు 10 వేల మంది భక్తులు వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అయితే వచ్చిన ప్రతీ భక్తుడికి అన్న వితరణ చేయడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రతీరోజు కూడా అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదం స్వీకరించకుండా భక్తులు తిరిగి వెళ్ళరు. గంటల కొద్ది సమయం పట్టినా భక్తితో భక్తులు ఎదురు చూస్తూ ఉంటారు. ఈ సందర్భంగా వారాహి పీఠం ఉపాసకురాలు లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసిలో మాత్రమే కొలివై ఉన్న వారాహి అమ్మవారు లోక కళ్యాణం కోసం కొవ్వూరులో వెలిశారని తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో అన్నదానం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## ఘనంగా జగదీష్ చంద్రబోస్ జయంతి



కాకినాడ, మేజర్ న్యూస్ : రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంతి జనరల్ మేనేజర్ ఇందుగుల ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ 1858 నవంబర్ 30న జన్మించిన జగదీష్ చంద్రబోస్ మొక్కలకు కూడా ప్రాణం ఉందని నిరూపించిన ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త అని అన్నారు. రేడియో మైక్రోవేవ్ ఆప్టిక్స్‌తో వృక్షశాస్త్రంలో గణనీయమైన ఫలితాలను ఆయన సాధించారని అన్నారు. రేడియో విజ్ఞానంలో పితామహునిగా ఆయనను పేర్కొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, శిరీష, రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో అక్రమ నిర్మాణాలపై గళమెత్తిన కౌన్సిల్

**– టిడ్కో గృహాల్లో అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్**
**– కౌన్సిలర్లకు సమాచారం లేకుండా సమీక్షలు చేస్తున్నారని ఆరోపణ**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** టిడ్కో గృహాల్లో అవినీతి జరిగిందని ఇక్కడ పనిచేసి వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ టిడ్కో ఫ్లాట్లలో పేర్లు మార్చి 20 ప్లాట్లు అమ్ముకున్నారని కౌన్సిల్ ప్రతిపక్ష అల్లవరపు నగేష్ ఆరోపించారు. శనివారం పిఠాపురం సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్పర్సన్ గండేపల్లి సూర్యవతి రామారావు అధ్యక్షతన ప్రారంభమైంది. కౌన్సిల్ సభ్యులు నగేష్ మాట్లాడుతూ...టిడ్కో గృహాల్లో అవినీతి జరిగిందని, ఒక 20మంది లబ్ధిదారుల పేర్లు తొలగించి వారి స్థానంలో మరో కొంతమంది పేర్లను ఇక్కడ పనిచేసిన టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ మార్చివేసి అమ్ముకున్నారని ఆరోపించారు. బెజవాడ వీర పద్మ, కొసిరెడ్డి కావేరి అనే పేర్లు తొలగించారని ఇవి కాకుండా ఎక్కడ టిడ్కోగృహాల్లో అవినీతి జరిగినట్లు తెలిపారు. మూడేళ్ల కౌన్సిల్లో అభివృద్ధి చేయనప్పటికీ అధికారుల అవినీతి మాత్రం తీవ్రంగా జరిగిందని విమర్శించారు. ఈ విషయంపై కమిషనర్ నామ కనకారావు వివరణ ఇస్తూ... 2017 -18 సంవత్సరాలలో కేటాయించిన వారికి గృహాలు ఇవ్వడం జరిగిందని, అయితే 2021లో జెసి అనుమతితో నిబంధనల ప్రకారం లబ్ధిదారుల పేర్లు రివైజ్ చేయడం జరిగిందన్నారు. రెండు నెలల్లో టిడ్కో కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించి తదుపరి లబ్ధిదారులు అందరికీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.దీనిపై కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ...ఇల్లు ఉన్నవారికి టిడ్కో గృహాలు ఇచ్చారని, కొందరికి సివిల్ స్కోర్ బాలేదని వారికి ఇల్లు అప్పగించలేదని అన్నారు.దీనిపై కమిషనర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు 318 మంది లబ్ధిదారులకు గృహాలు అప్పగించడం జరిగిందని, గతంలో 96 మందికి అప్పగించినప్పటికీ వారు గృహాల్లోకి రాలేదని తెలిపారు. త్వరలోనే బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు రుణాలు ఇప్పించి వారికి ఇళ్ల అప్పగించడం జరుగుతుందని తెలిపారు. మరో కౌన్సిలర్



రాయుడు శ్రీను మాట్లాడుతూ.. టిడ్కో సముదాయంలో త్రాగునీరు, లైటింగ్ ,జంగిల్ క్లియరెన్స్ చేయవలసి ఉందని, తద్వారా లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇతర కౌన్సిలర్లు పెదపాటి నాగేశ్వరరావు, సోమ రౌతు లలితా దేవి మాట్లాడుతూ... టిడ్కో గృహాల్లో అంతా అవినీతి అక్రమాలు జరిగాయని, అర్హత లేని వారికి లబ్ధిదారులు కాని వారికి ఇల్లు అప్పగించడం జరుగుతుందని ఆరోపించారు . అలాగే పట్టణంలో అక్రమ కట్టడాలు బైపాస్ రోడ్‌లో అక్రమ నిర్మాణాలు అనుమతులు లేకుండా జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు, వాటర్ సప్లై కట్ చేయాలని పెదపాటి నాగేశ్వరరావు టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. బోను దేవా మాట్లాడుతూ...ఇటీవలఅగ్రహారంలో ఆక్రమణలు జరిగినట్లు మున్సిపల్ అధికారులు జెసిబిలతో తొలగిస్తున్నారని,ఆభూములు దళితులు కొనుక్కుంటే వాటిని తొలగిస్తున్నారని నిలదీశారు.దీనిపై కమిషనర్ వివరణ ఇస్తూ... అది ప్రభుత్వ భూమి అని, మున్సిపాలిటీ కాదని, రెవెన్యూ పరిధిలో భూమిగా పేర్కొన్నారు. అయితే అక్కడ కొనుక్కుని రిజిస్ట్రేషన్ చేయించుకోవడంవాస్తవమేఅయినప్పటికీఅక్కడ కొనుక్కోవడం అమ్మడం కూడా నేరమని తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు వెళ్ళడం జరిగింది తప్ప మున్సిపాలిటీ స్థలం కాదని ప్రభుత్వ భూమి ఎకరం అర అక్కడ ఉన్నట్లు పూర్తిగా రెవిన్యూ కి సంబంధించిన భూమిగా తెలిపారు. కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ఇటీవల చేస్తున్న లేఔట్లకి కూడా అనుమతి ఇచ్చినప్పటికీ కొనుగోలుదారుడుకి పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించకుండా రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యము త్రాగునీటి అవసరాలు పార్కులు ఏర్పాటు చేయకుండా క్రయ విక్రయాలు చేస్తున్నారని,అలాంటి స్థలాల్లో నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. డ్రైవర్స్ కాలనీలో సీసీ రోడ్లు లేని వాటర్ సప్లై లేని స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. మరో కౌన్సిలర్ పెదపాటి రాజేష్ మాట్లాడుతూ...పట్టణంలో త్రాగునీరు మురికిమయంగా, నురగగా వస్తుందని శుద్ధి కలిగిన నీరు ప్రజలకు అందివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల కాలంలో డిప్యూటీ సీఎం పర్యటన చేయడం శుభ పరిణామం అయినప్పటికీ కౌన్సిల్ సభ్యులకు ఎటువంటి సమాచారం లేకుండా ఎమ్మెల్యే అయిన డిప్యూటీ సీఎం రావడం, కౌన్సిలర్లు చెప్పిన పనులు చేయకుండా డిప్యూటీ సీఎం చెప్పారని అభివృద్ధి పనులు చేస్తున్నారని, కౌన్సిలర్లకు విలువ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . వైస్ చైర్మన్ పశ్చిమల్ల జ్యోతి అప్పలరాజు మాట్లాడుతూ... కౌన్సిల్ సభ్యులు అడిగితే అభివృద్ధి పనులు చేయని అధికారులు ఎమ్మెల్యే ఎంపీ చెపితే చేస్తున్నారని కౌన్సిల్ సభ్యులకు అసలు విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. గత కౌన్సిల్ సమావేశంలో నా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మినిట్స్ బుక్ లో కౌన్సిల్ తీర్మానం సమావేశంలో జరిగింది. ఒకటైతే మరొకటి రాశారని ఇది కౌన్సిల్ సభ్యులు అందర్నీ తప్పుదోవ పట్టించినట్లు అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలోని రెండు అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

## భక్త జనంతో పులకించిన వాడపల్లి క్షేత్రం





ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి క్షేత్రం భక్త జనంతో పులకించింది. వేకువ జాము నుండి స్వామివారిని దర్శించేందుకు రాష్ట్రాల నుండి వేలాది మంది వ్యక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సినీ నటులు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు తదితరులు స్వామివారి చిత్రపటం అందించారు. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.44 లక్షలు సమకూరింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, ఎస్ఐ ఎస్.రాము, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హేవలాక్ వంతెనను పర్యాటకంగా అభివృద్ధి చర్యలు



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రాజమహేంద్రవరం, కొవ్వూరు పట్టణాల మధ్య ఉన్న గోదావరి పై మొదట వంతెనగా పిలవబడే హేవ లాక్ వంతెనను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మొత్తం నిధులు స్పెషల్ అసిస్టెంట్స్ స్టేట్ ఫర్ ఇన్వెస్ట్మెంట్ పథకం ద్వారా రూ.94.44 కోట్లు మంజూరు కాగా మొదట విడతగా 62.33 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఇప్పుడు విడుదలైన నిధులు ఖర్చయ్యాక మిగిలిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. గత ప్రభుత్వాలు ఈ వంతెనను నిర్లక్ష్యంగా వదిలేశాయి.ప్రస్తుతం ఏర్పడిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈ నేపథ్యంలో వంతెన అభివృద్ధికి మార్గం సుగమమైంది. వంతెన అభివృద్ధి పాటు వంతెన కింద ఉన్న లంక ప్రాంతాలలో రిసార్ట్లని ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందజేయనుంది నిర్మాణం విషయానికి వస్తే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం కాలంలో 1900 ప్రాంతంలో నిర్మాణం బ్రిడ్జి నిర్మాణం జరిగింది సుమారు వంద సంవత్సరాలు రైల్వే శాఖకు ఉపయోగపడిన ఈ వంతెనను 1997 ప్రాంతంలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చూపిన చొరవకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచి నిధులను విడుదల చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. అదేవిధంగా మరికొద్ది రోజుల్లో పర్యాటక ప్రేమికులకు కనువిందు చేయనుంది.

## శనీశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**కొత్తపేట,మేజర్ న్యూస్:**మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు.తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రాతఃకాల అర్చన నిర్వహించి,అనంతరం భక్తులచే తైలాభిషేకాలు,సర్వ దర్శనములు జరిపించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంఛార్జి ఆలయ సహాయ కమిషనర్,కార్య నిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.తైలాభిషేకముల ద్వారా రూ.1,73,025,అలాగే అన్న ప్రసాదం విరాళాలుగా రూ.48,839 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

## పెద్దాపురం డివిజన్‌లో 899 మంది ఉపాధ్యాయ ఓటర్లు

**– ఆర్డీఓ కె.శ్రీరమణి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలలో డిశంబర్ 5వ తేదిన నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎఈఆర్వో మరియు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. ఈసందర్భంగా ఆమె తెలుపుతూ డివిజన్‌లో 899 మంది ఉపాధ్యాయ ఓటర్లు వివరాలు నమోదు చేసుకున్నారని, వాటిలో జగ్గంపేటలో 43, ఏలేశ్వరంలో 101, ప్రత్తిపాడు 72, శంఖవరం 54, రౌతులపూడి 43, కోటనందూరు 23, తుని 261, తొండంగి 61, కిర్లంపూడి 53, పెద్దాపురం 156, గండేపల్లి 32 మంది ఓటర్లు ఉన్నారని, వీరు ఓటు వేసేందుకు ఆయా మండలాల మండల పరిషత్ కార్యాలయాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు.

## క్రీడాకారులలో ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్లు దోహదం





కాకినాడ,మేజర్‌న్యూస్: క్రీడాకారులలో ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఓ.ఎన్.జి.సి. జి.ఎం. సునీల్ కుమార్ హరీస్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ పేర్కొన్నారు.కాకినాడ డి.ఎస్.ఎ. క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఫైనల్స్ మ్యాచ్ సిటి ఎఫ్.సి., కాకినాడ స్వామి & ఫ్రెండ్స్ ఫుట్‌బాల్ క్లబ్ కాకినాడ మధ్య జరిగింది. ఫైనల్‌లో పాల్గొన్న ఇరు జట్లు హెూరాహెూరిగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో సిటి ఎఫ్.సి. కాకినాడ జట్టు విజేతగా నిలిచింది. స్వామి & ఫ్రెండ్స్ ఫుట్‌బాల్ క్లబ్ కాకినాడ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి టోర్నమెంట్ నిర్వాహకులు స్వామి అధ్యక్షత వహించగా ఓ.ఎన్.జి.సి. జి.ఎం. సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగాను, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ విశిష్ట అతిథిగాను, డి.ఎస్.డి.ఓ. శ్రీనివాసకుమార్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో విజేతలకు అతిథులు విన్నర్స్, రన్నర్ టోఫీలను బహుకరించారు. డి.ఎస్.డి.ఓ.గా ఉంటూ జిల్లా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న డి.ఎస్.డి.ఓ. శ్రీనివాసకుమార్‌కు తలాటం హరీష్ క్రీడాకారుల తరపున జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రవికౌర్, చిన్నరవికౌర్, స్వామి శ్రీనివాస్ కోరుమిల్లి, వీరమల్ల దుర్గాశ్రీప్రసాద్, ఫుట్ బాల్ క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

## త్రాగునీరు, శానిటేషన్‌పై అధికారులు దృష్టి పెట్టాలి - చైర్‌పర్సన్



పెద్దాపురం, మేజర్ న్యూస్ : ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొద్దు తులసి మంగతాయారు సూచించారు. శనివారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొద్దు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు త్రాగునీరు, వీధిలైట్లు, పారిశుద్యంపై దృష్టిపెట్టాలని, తెలిపారు. అనంతరం పలు అంశాలపైపై చర్చించడం జరిగింది. దీనితో పాటు పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డులలో సమస్యలపై సమావేశంలో లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, మున్సిపల్ డిఇ ప్రకాశరావు, ఆర్వో చంద్రశేఖరం, మున్సిపల్ టిపిఓ చింతా ఫణికుమార్, ఏఇలు జీవకృష్ణప్రసాద్, ఉమామహేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, టిపిఎస్ శ్రీరమ్య, ఆర్ఐ గంగాధర్, కౌన్సిలర్ గుమస్తా అత్తిలి వీర్రాజు, అకౌంటెంట్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

# అపార్ ఐడీ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలి

**– నోడల్ ఆఫీసర్లతో నగరపాలక సంస్థ కమిషనర్ భావన**



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** అపార్ ఐడీ నమోదు లక్ష్యాన్ని నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత స్పెషల్, నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. శనివారం ఈ మేరకు వారితో సమావేశమయ్యారు. నగరపాలక సంస్థలోని పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈసమావేశంలో కమిషనర్ భావన మాట్లాడుతూ.. అపార్ ఐడీ నమోదు వేగవంతం చేయాలని, అవసరమైతే స్కూలుకు వెళ్లి నమోదు ప్రక్రియ ఎలా జరుగుతున్నది పరిశీలించాలని సూచించారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్లో మార్పులు ఏమైనా ఉన్నా వెంటనే వాటిని సరిదిద్దేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అపార ఐడీ నమోదు వేగవంతంగా పూర్తి చేసేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అప్రమత్తం చేయాలని కమిషనర్ భావన ఆదేశించారు. ప్రతి విద్యార్థి అపార్ ఐడీ వివరాలను యూడైస్ ప్లస్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ సమయంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తినా వెంటనే వాటిని సరిదిద్దాలని సూచించారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలన్నారు. రాబోయే కాలంలో ఈ ఐడీకి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కాకినాడ అర్బన్ పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల అపార్ ఐడీని నూరు శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కూటమిదా... కాదా?

**– కాకినాడ యాంకరేజ్ పోర్ట్ ప్రభుత్వ ఆధీనంలో ఉంది**
**– పట్టుకున్న బియ్యం షిప్‌లోకి ఎలా వచ్చాయి?**
**– కూటమి ప్రభుత్వంలో సమన్వయ లోపం ఉందా?**
**– పవన్ వ్యాఖ్యలపై మాకు అనేక అనుమానాలు ఉన్నాయి**
**– వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు**




**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు కొన్ని నెలలు కావస్తున్నా పచ్చి అబద్ధలతో కాలయాపన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాకినాడ యాంకరేజ్ పోర్ట్ ప్రభుత్వం ఆధీనంలో ఉంటే రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హెూదాలో ఉన్న పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు చూస్తే విడ్డురంగా ఉందన్నారు. ఈ రాష్ట్రంలో పాలన కూటమిదా కాదా అనే సందేహాలు ప్రజలు నుండి వ్యక్తమవుతున్నాయన్నారు. అసలు కూటమి నాయకుల మధ్య సఖ్యత ఉందా అనే అనుమానం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనతో తేటతెల్లం అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వంపై తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు కన్నబాబు గుప్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడు, అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు కావాలని జనసేన, బీజేపీ కలిసి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కాకముందే ప్రజలపై అనేక రకాలుగా బాదుడు కార్యక్రమం చేపట్టారని, దానిలో భాగమే విద్యుత్ చార్జీలు పెంపు అని అన్నారు. రాష్ట్రంలో బాబు షూరిటి బాదుడు గ్యారంటీ ప్రారంభం అయిందని కన్నబాబు విమర్శించారు. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి కాకినాడ పోర్టులో ఎవరైనా తీవ్రవాదులు వస్తే ఎవరు సమాధానం చెపుతారని అనడం ఆయన ప్రభుత్వాన్ని ఆయనే ప్రశ్నించుకున్నారని అన్నారు. ఏది ఏమైనా రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరుగినా తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డిపై నిందలు వేయడం సరికాదని హితవు పలికారు.

## ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి నెల ఒకటో తారీకున ప్రతిష్టాత్మంగా చేపడుతుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జనసేన నాయకులు బి.యన్ రాజు అన్నారు. డిసెంబర్ నెల ఒకటో తారీకు ఆదివారం కావ డంతో... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఒకరోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామంలో జరిగిన పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో బి.యన్ రాజు, ఉప సర్పంచ్ మరియు జన సేన నాయకులు ఏనుగంటి హరిబాబు సచివాలయం సిబ్బంది పాల్గొని అవ్వ తాతలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## ఎయిడ్స్, హెచ్ఐవి పై ప్రజల్లో అవగాహన ముఖ్యం





రంపచోడవరం, మేజర్ న్యూస్ : 'ఎయిడ్స్' వ్యాధి, హెచ్ఐవి వైరస్ పట్ల ప్రజల్లో అవగాహన ముఖ్యమని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ పేర్కొన్నారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పర్యవేక్షణలో అంతర్జాతీయ ఎయిడ్స్ డే ను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు విద్యార్థులుతో ర్యాలీ నిర్వహించారు. నవంబరు 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అలాగే పోస్టర్ మేకింగ్ ప్రజెంటేషన్, రంగోలి పోటీలు, ప్రిన్సిపల్, స్టాఫ్ వాలంటీర్స్, విద్యార్థులుతో అవగాహన ర్యాలీ డిగ్రీ కళాశాల నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్లి అక్కడ మానవహారం చేపట్టారు. కాగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ చేతులు మీదుగా బహుమతులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి, హెచ్ఐవి వైరస్ గురించి సమాజానికి అవగాహన చాలా అవసరమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెజీ వెంకటేష్, సీనియర్ అధ్యాపకులు చక్రవర్తి, శివకుమారి, సీనియర్ అసిస్టెంట్ భరత్, ఉష, ఎన్.అశోక్, కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుంది



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఏపీఎస్ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి అన్నారు. శనివారం ఏలేశ్వరం డిపోలో నిర్వహించిన పదవీ విరమణ సభకు ఆయన అధ్యక్షత వహించారు. మూడు దశాబ్దాల కాలంగా ఆర్టీసీలో కండక్టర్గా పనిచేసే ఎలాంటి రిమార్కులు లేకుండా అనేకమార్లు అవార్డులు పొందిన ఎస్ ఎన్ రాజు, బాలా త్రిపుర సుందరి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బందితోపాటు నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్యకర్తలు కార్యాలయం సిబ్బంది గ్యారేజి స్టాఫ్తదితరులు పాల్గొన్నారు.